


సంపుటము ౯] రాజమహేంద్రవరము : శా. శ. ౧౮౬౧ నిజశ్రావణం ౧౦ సెప్టెంబరు ౧౯౩౯ [౬ సంచిక

1939

వ్యాఖ్యానములు

మహాయుద్ధానికి స్వాగతం

ప్రపంచానికంతటికీ సంబంధించిన మహాయుద్ధం మళ్ళీ ప్రారంభ మయింది.

౧౯౧౮ లో జరిగింది విరామమే గాని సమాప్తి కాదు. కాగా యిది దాని శేషమే గాని కొత్తది కాదు.

ఈమధ్యకాలం, మారణయంత్రాలలో విపరీతమైన పోటీతో, అభివృద్ధి చెయ్యడానికే వుపయోగపడింది.

ఇది చాలా విచారకరమైన విషయం.

సభ్యలోకం, రక్తపిపాస గల రాజ్యాలప్పట్లోనే అంతరించిపోతా యనుకుంది; కాని అలా జరగలేదు.

అలా జరిగే వుంటే ప్రపంచానికిప్పుడీ దౌర్భాగ్యం మళ్ళీ తటస్థించి వుండకపోవును.

అయితే, యీ సమాలోచన యిప్పుడు నిష్ప్రయోజనం.

యుద్ధం యెలాగా ప్రారంభం అయిపోయింది.

మహామహారాజ్యా లందులో కొన్ని యెలాగా వురకనే వురికాయి.

ఇప్పుడు "తాటస్థ్యం వహించాం" అని చెబుతూ వున్న మహారాజ్యాలు కూడా, మాసాల దాకా అక్కర్లేదు, రోజుల్లోనే యుద్ధంలో దిగవలసిన పరిస్థితు లేర్పడక మానవు.

ప్రపంచంలో సగానికి పైగా అగ్గిలో దూకి వుంటే తక్కిన సగమూ వొడ్డున కూచుని వింత చూడడం ధర్మమూ కాదు. సాధ్యమూ కాదు.

అవి కూడా చేరితే యూరపులో యిదే చివరి యుద్ధం అయిపోతుంది.

కాకపోతే, యింకొకప్పుడింకొక గొప్ప యుద్ధం జరక్క మానదు.

యూరపియన్ రాజ్యాలవారికి దురాశలూ, దుర్భ్రమలూ యెక్కువైనాయి.

నాగరికతకు విలాసభూము లైన ఆరాజ్యాలు ధనతృష్ణలో తగులుకుని విర్రవీగుతున్నాయి.

ఇది మారాలి.

ఇప్పుడు కొన్ని రాజ్యాలు వొడ్డున కూచుని వుంటే యీమార్పు జరగదు.

తమ ప్రతిభకు ఫలితాలైన సౌకర్యాలు తమ జాతికి మాత్రమే చెంది వుండాలని హద్దులు గీసుకుంటూ వున్న యూరపియను జాతులవారు, తమ నిర్మాణశక్తికి ఫలితాలైన వర్తకవాణిజ్యాలు కూడా తమ దేశం

దాటి పోగూడ దనకోగలిగివుంటే యీ అవమానుష చర్యలకు అక్కడ ప్రసక్తి లేకపోయివుండును.

ఏతావతా :

రాట్నంవంటి చచ్చి కుళ్ళి పన్నయిపోయిన పరిక రాలూ, మద్యనిషేధంవంటి అర్థం లేని వృథావ్యాపారాలూ హిందీవంటి జీవం లేని భాషా ప్రపంచంలోనుంచి భరత ఖండాన్ని విడతీయ్యలేవు.

ఇది ప్రపంచయుద్ధం అని నిర్ధారణ అయినప్పుడు దీందులో భరతఖండానికీ, మన ఆంధ్ర దేశానికి కూడా సంబంధం అనివార్యం అవుతోంది.

శాంతికాముడైన జార్జిచక్రవర్తి విధిలేక యుద్ధంలో దిగవలసివచ్చినప్పుడు మనం ప్రతికూలంగా గాని అథవా తటస్థంగా గాని వుండిపోడానికి వీల్లు లేవు.

పవిత్రోద్దేశాలు ప్రకటిస్తూ బ్రిటను ఈయుద్ధంలో దిగిందో అవి సర్వజనాదరపాత్రాలు. విశ్లేషించి మనకి శిరసాధార్యాలు.

ఎంత కానిసలస్తు పడి వుండినా మనలోనూ అసహాయశూరు లనేకులు లేకపోలేదు.

అస్వాభావికబోధలు చేసి వారి శౌర్యాగ్నిని చల్లార్చడం మంచిదీ కాదు. సాధ్యమూ కాదు.

నిజంగా, యీమహాయుద్ధంతో అనేకజాతులవారి శక్తిసామర్థ్యాలు వెల్లడి అవుతాయి.

అనేకరాజ్యాలవారి నయవంచన బహిరంగం అవుతుంది.

అనేకజాతులవారి నిగూఢశక్తు లుద్బుద్ధా లవుతాయి.

అనేకుల అఖర్వగర్వం చూర్ణం అయిపోతుంది.

సకలదేశాల మాపులూ మారిపోతాయి.

ప్రపంచం అంతటా నూత్నశకం ప్రారంభం అవుతుంది.

ఈమహాయుద్ధంలో ప్రవహించే రక్తనదులు తీసుకుని వచ్చే సరుకు లివి.

ఈకారణంవల్ల కూడా బ్రిటిషువారితో పాటు మన మున్నూ యీదారుణసంగ్రామానికి నిర్బంధసాహాయ్యం నివేదించవలసి వుంది.

అనేకసామ్రాజ్యాలు నెలకొల్పి, చిరకాలం అనేక జాతులను పాలించిన గొప్పజాతి మన ఆంధ్రజాతి.

దాని పూర్వగౌరవం నిలవడానికిన్నీ, ఇప్పట్లో ఏజాతికీ తీసిపోకుండా వుండడానికిన్నీ, దీనివల్ల వచ్చే కష్టాలైనా సుఖాలైనా ఇతరులతో పాటు సమంగా అనుభవించడానికిన్నీ, ఉత్తరదేశంలో శిక్కులూ రాజపుత్రులూ అయితే, దక్షిణదేశంలో శూరజాతికి చెందిన వారు ఆంధ్రు లని ప్రపంచం గుర్తించవలసివున్నది కాబట్టిన్నీ, మన ఆంధ్రుల శక్తిసామర్థ్యా లన్నీ ఈతరుణంలో బ్రిటిషువారికి బాసటగా వున్నా యని మేము జార్జిచక్రవర్తికి విన్నవించుతూ వున్నాము.

మేము జార్జిచక్రవర్తికి దిగ్విజయం కోరుతున్నాము. ఇంకెక్కడి ఆంధ్రరాష్ట్రం ?

మహాయుద్ధం ప్రారంభం అయింది.

ఎన్ని రాష్ట్రాలు దుమ్మయిపోతాయో ? ఎన్ని రాజ్యాలు బుగ్గయిపోతాయో ? ఎన్ని మంత్రివర్గాలు నామరూపాలు లేకుండా పోతాయో ? ఎందరు అవతార పురుషులు మూలపడిపోతారో ?

ఎంతో వోపికపట్టి, ఎన్నో శాంతిప్రయత్నాలు సాగించి, విధిలేక యెంతో సాధన సామగ్రి సమకూర్చుకుని,—అప్పుడేనా ముందు హిట్లరే బాంబు విడిచి పెట్టడంవల్ల చివరికి బ్రిటిషువారు కూడా యుద్ధంలోకి దిగవలసివచ్చింది.

తమకి సాక్షాత్సంబంధం లేని మహాయుద్ధంలో బ్రిటిషు వారు కూడా ప్రవేశించవలసివచ్చిం దంటే యిక శాంతికి అవకాశం లేశమూ లే దన్నమాట.

మహాసముద్రాలతో అయిదు ఖండాల భూభాగమూ కుతకుతలాడిపోవలసిందే అన్నమాట.

సాధారణంగా ప్రపంచం అంతటా మార్షల్ లా గాని అలాంటి నిబంధనలు గాని అమలులో వుండే రోజు లివి.

ఇలాంటి సమయంలో, గుంటూరి కాంగ్రెస్సాంధ్ర మహాసభలో, బ్రిటిషువారు ఆరు మాసాలలో ఆంధ్ర రాష్ట్రం నిర్మించకపోతే సత్యాగ్రహం సాగిస్తా మని అఖండతీర్మానం.

ఏ పార్లమెంటరీశక్రటరీలో, ఏమంత్రులో, ఏవర్కింగు కమిటీ మెంబరో, చివరికి గాంధిగారో కష్లేరశేశారో యేమిటో ఆరుమాసాల గడువు సందర్భంలో గడగడ వడకిపోతూ స్టేటుమెంట్లు, ఆంధ్రమహాసభకి దూరం అయిపోవా లని గుసగుసలు.

ఈపరిస్థితుల్లో మహాసభలో పహార్పు కనపడుతోందని కాంగ్రెస్సేతరులు కొందరు తృప్తిపడడం.

ఏమి దూరదృష్టి ? ఏమి రాజ్యతంత్రజ్ఞతా ?

ఈస్థితిలోనా, యిలాంటి ఆంధ్రులకా ప్రత్యేక రాష్ట్రం ?

ముందో మాటు కూడా అధ్యక్షులు కాగూడ దనే

కాంగ్రెస్సు మూలసూత్రా లన్నీ తిరస్కరిస్తూ వున్న కాంగ్రెస్సు మంత్రు లందరూ గాంధిగారి వొడిలో సుఖ నిద్ర అనుభవిస్తున్నారు ; కాని కాంగ్రెస్సు మూల సూత్రాలు కచ్చితంగా అమలు జరపా లని నొక్కి చెబుతూ వున్న బోసుగారిమీద గాంధిగారు దారుణ శిక్ష విధింపచేశారు.

స్వార్థపరుల రాక్షసప్రభుత్వంలో సత్యమూ ధర్మమూ ఇలాగ ప్రతిహతం అయిపోవడం అస్వాభావిక మైనది కాదు.

ప్రజల అజ్ఞానాని కిది ఫలితం. ప్రజల స్వరాజ్యా సమర్థత కిది దృష్టాంతం.

కాకపోతే, గాంధిగారికి, వొకచేత్తో ౧౯౩౫ సంవత్సరపు ఇండియాశాసనాన్ని తిరస్కరించే కాంగ్రెస్సు మీద నియంతృత్వమూ, వొకచేత్తో కాంగ్రెస్సుకి సర్వాత్మనా ప్రతికూలమైన రాష్ట్రీయప్రభుత్వాన్ని అమలు జరిపే యెనిమిది మంత్రివర్గాలమీద నాయకత్వమూ నిర్వహించడానికి అవకాశం యెందు కుంటుంది?

అయితే : ఇక్కడ మనం గుర్తించవలసిం దేమిటంటే ?

కాంగ్రెస్సుమీదా, ఎనిమిది రాష్ట్రాల మంత్రి వర్గాలమీదా సత్యాహింసలకు దూర మైన అధికారం చెలాయిస్తూ వున్న గాంధిగారికి ఒక్క బోసుగా రంటే సింహస్వప్నం. గడగడ.

"ఏం" అంటే స్వార్థపరు లైన నియంతల కిది స్వభావం.

ప్రజలకు మభ్యపెట్టానం కలిగించి స్వలాభం సాధించు కోవా లనుకునేవారి కిది నైజం.

ఇది యిలాంటిదే కాకపోతే, రెండోమాటు కూడా బోసుగారు కాంగ్రెస్సధ్యక్షు లైతే గాంధిగారి కంత అసూయ యెందుకూ ?

అధ్యక్షుని నిర్ణయించుకునే హక్కు కాంగ్రెస్సు సభ్యులదిగాని గాంధిగారిది కాదు.

కాంగ్రెస్సు సభ్యులు లక్షలు లున్నారు గాని తక్కువగా లేరు. అధ్యక్షపదవాధికారం వున్న ప్రతినిధులు ఆలక్షల సభ్యుల స్పష్టమైన సమ్మతి గలవారు గాని లూకాయిలూకాయిగాళ్లు కారు.

వారయినా బోసుగారియెడల గాంధిగారు విముఖులై, యాగ్రహాతువులై వున్నారని యెరిగివున్నారు ; గాని కళ్లు మూసుకుని వుండలేదు. అలాంటివారు "నువ్వా నేనా ?" అని అధర్మాన్నీ, అసత్యాన్నీ, అసమర్థతనూ యెదిరించి వరించిన బోసుగారిని కుట్రపన్ని, మంత్రులను పురికొల్పి తోసిరాజు చేయించవలసిన అగత్యం గాంధిగారి కేమి వున్నదీ ? అధికారమున్నా యేమివున్నదీ ?

కాంగ్రెస్సు సిద్ధాంతాలు దేశాన్ని వుద్ధరిస్తాయా, ముంచేస్తాయా అనే విషయం అలా వుంచుదాం.

బోసుగారు ఆసిద్ధాంతాలకు బద్ధులు. పట్టాభిగారి కంటే—రాజాజీగారికంటే—పటేలుగారికంటే—గాంధి కంటే కూడా బోసుగారు కాంగ్రెస్సుసిద్ధాంతాలకు బద్ధులు.

గాంధిగారి దృష్టిలో—స్వార్థప్రయత్నంలో అదే తప్పయింది.

ఏమి కాంగ్రెస్సూ

అది అంతటితో ముగిసిపోతే బాగుండిపోయేది కాని పూర్తి ప్రతిఘటన వచ్చి స్థానభ్రంశం పొందేదాకా విలయతాండవం చెయ్యడమే స్వార్థపరుల పద్ధతి.

ఇప్పుడు బోసుగారిమీద డిసిప్లిన్ అమలుజరపడంలో యిదే వ్యక్తమైనది.

గాంధిగారి నిరంకుశత్వంవల్ల కాంగ్రెస్సుసభ్యులు, మూడోమాటు కూడా బోసుగారినే అధ్యక్షులుగా వరించే పరిస్థితులు తటస్థించాయి.

చెయ్యి కాలిందాకా ఏమెందు కూరుకోవా లని, అసలు, బోసుగారికి అధ్యక్షస్థానార్హత లేకుండా చెయ్యడానికే గాంధిగారు డిసిప్లిన్ అమలు జరిపించారు.

ఇందులో మరో అర్థంగాని, వుద్దేశంగాని యేమంత మాత్రమూ లేవు.

గుంటూరి ఆంధ్రమహాసభ

మిత్రులు గుమ్మడిదల వేంకటసుబ్బారావు, మల్లెల శ్రీరామమూర్తిగార్లు దీని విషయం చక్కగా చెప్పారు.

ఈసంవత్సరం ప్రతినిధులు ౧౪౦౦. ఇది సంతోషించవలసిన విషయమే; కాని మహాసభమీద కాంగ్రెస్సు బురద యింకా ముమ్మరంగానే వుంది. ఇక ప్రతినిధులెందరు వస్తే యేం లాభం!

ఆహ్వానసంఘం యేర్పడకుండానే అధ్యక్షవరణం. కాంగ్రెస్సాంధ్రులకు తప్ప యితరుల కిది సాధ్యపడేది కాదు. గాంధిగారు కాంగ్రెస్సు అధ్యక్షుణ్ణి నామినేటు చేసినట్టు, తాము ఆంధ్రమహాసభ అధ్యక్షుణ్ణేనా నామినేటు చెయ్యకపోతే యింకేముందీ? అని అనుకుని వుంటారు వేంకటప్పయ్యగారు. అయితే, విశ్వేశ్వరయ్యగారా యీ అనుచిత సంకల్పాలకు లొంగేవారు? పిఠాపురం మహారాజావారు మాత్రం యిందులో వున్న గూడుపుఠాణీ గుర్తించలేనివారా?

కాక, పిఠాపురంవారిని పిలవడం, యీ పరిస్థితుల్లో వా రెలాగా వొప్పుకో రని తెలిసి చేసిన పనే. కాంగ్రెస్సేతరు లెవరూ దొరకలే దని చెప్పడానికి వేసిన యెత్తే. పదవు లన్నీ—పెత్తనం అంతా కాంగ్రెస్సాంధ్రుల అధీనంలో వుంచుకోవా లని చేసిన తంత్రమే.

ఆహ్వానసంఘాధ్యక్షులు కాంగ్రెస్సాంధ్రులు. అధ్యక్షులు కాంగ్రెస్సాంధ్రులు, ప్రదర్శనప్రారంభం చేసినవారు కాంగ్రెస్సాంధ్రులు, మహిళాసభాధ్యక్షత కూడా కాంగ్రెస్సాంధ్రులదే. మహాసభా ప్రారంభకులంటూన్నా కాంగ్రెస్సాంధ్రులే.

ఇంతే కాదు. గుంటూరి సభకి గుంటూరి కాంగ్రెస్సాంధ్రులే ప్రారంభకులు.

దీన్నేమనాలి? మద్రాసుశాసనసభలో అర్థంలేని తీర్మానం ప్రవేశపెట్టి, యిప్పటికీ మంత్రివర్గంవారి ఐక్యం గుర్తించలేకుండా వున్న వెంకటప్పయ్యగారు ఆంధ్రైక్యం కోరుతున్నా రని యెలాగా నమ్మడం? చెప్పడం మాత్రం యెలాగా?

గుంటూరి జిల్లాలో నిజమైన నాయకులైన నడింపల్లి నరసింహారావుగారికి సభలో ప్రవేశం లేకుండా చెయ్యాలని ప్రయత్నాలు సాగించినవారికి ఆంధ్రత్వం వుం దని అంగీకరించడం యెలాగా?

గుజరాతీకాంగ్రెస్సుకి దెబ్బ తగలకుండా చెయ్యాలని కాక, ఆంధ్రరాష్ట్రం కోసమే అయితే యీపాట్లన్నీ యెందుకూ?

కాంగ్రెస్సు వర్కింగు కమిటీ అనుగ్రహం తప్పిపోకుండా చూసుకోడానికి కాకపోతే, పట్టాభిగారు, అర్థంలేని తీర్మానం తయారు చెయ్యడం యెందుకూ? వారికి నిజంగా రాష్ట్రమే కావలసి వుంటే ఆరునెలల గడువు అన్నందుకు యిప్పుడు స్టేటుమెంటు ప్రకటించవలసిన అగత్యం యేమిటీ?

ఇక అధ్యక్షులు అసలా ఆంధ్రులా అనే చర్చతో మా కేమీ సంబంధం లేదు. ఏమంటే? వారు అధ్యక్షులు. అంతే. సభ నడిపినవారు మరొకరు. సభానిర్వాహకులు, అధ్యక్షులు తమ పెత్తనానికి అడ్డం రాకుండా వుండడమే ప్రధానంగా చూసుకున్నారు. అనంతశయనం అయ్యంగారు, కృతకాంధ్ర భాషారక్షణామే ప్రధాన మను

కున్నారు. ఇక లోకేమిటీ? ఉభయులకూ సంఘర్షణకు అవకాశమే లేకపోయింది.

ఇటు కాంగ్రెస్సుకి ప్రాతికూల్యం రాకుండా చూసుకునేవారూ, అటు కృతకాంధ్రభాషకి ముప్పు రాకుండా చూసుకునేవారూ కలిసి ఆంధ్రమహాసభ అయిందని పించారు. ఆంధ్రరాష్ట్రం కావాలని కోరినట్టు అనిపించారు.

ఎంత చాతుర్యమూ?

ప్రతినిధుల ఏకాగ్రత యెంత నవ్యంగా వున్నదీ?

ఇంత జరిగినా గుమ్మిడిదల సుబ్బారావుగారు "మహాసభని రాష్ట్రాభిమానులు బహిష్కరించగూడ" దనడం వింతగానే వుంది.

ఏమంటే? ఆంధ్రమహాసభకి ద్రోహం చేస్తూ వున్నది గుజరాతీల కాంగ్రెస్సు.

అందేకనే కాంగ్రెస్సేతరులకు ఆంధ్రమహాసభలో ప్రాజాపత్యం వుండగూడదని కాంగ్రెస్సాంధ్రుల పట్టుదల.

ఈపట్టుదల నిర్వహించుకోడానికి కాంగ్రెస్సాంధ్రులు తమ సర్వస్వమూ ధారపోస్తారు.

అయినా, కాంగ్రెస్సేతరులు బలపడి మహాసభని స్వాధీనపరుచుకుంటే కాంగ్రెస్సాంధ్రులువిడిచిపెట్టేస్తారు.

దీనికి పట్టాభిగారి స్టేటుమెంటే గొప్పనిదర్శనం.

అంటే యేమిటీ?

కాంగ్రెస్సాంధ్రులు కాంగ్రెస్సేతరులతో కలవరు. గుజరాతీలు వారిని కలవనివ్వరు.

ఇలాగ యెటయినా ఆంధ్రుల యేకైక సంస్థ అనిపించుకునే అదృష్టం ఆంధ్రమహాసభకి లేదు.

అయినప్పుడు, తమ శక్తి అంతా దుర్వ్యయం చేసుకుని ఆంధ్రమహాసభకోసం కాంగ్రెస్సేతరులు తంటాలు పడడం యెందుకూ?

ఆంధ్రులకు ఆత్మజ్ఞానమూ, ఆత్మవిశ్వాసమూ, ఆత్మగౌరవమూ కలిగించడానికి కాంగ్రెస్సేతరులు మరో సంస్థనే యెందుకు యేర్పాటుచేసుకోగూడదూ?

రాజగోపాలాచార్యులుగారు పూర్తిగా ఆంధ్రరాష్ట్రవిముఖులు. అంతర్జాతీయకపరిస్థితులు విషమించే దాకా ఆంధ్రరాష్ట్రతీర్మానాన్ని గెంటుకుపోవడానికే వారు చాలా ప్రయత్నాలు చేశారు.

అవతల మహాయుద్ధం ప్రారంభం అయిపోయిన తరవాత యిక ఆంధ్రరాష్ట్రం అంటే యేమన్నమాటా?

ఆంధ్రరాష్ట్రనిర్మాణం కాంగ్రెస్సుచేతిలో లేదు. ఎంతమాత్రమూ లేదు. దానికోసం కాంగ్రెస్సయినా బ్రిటీషువారిని ఆశ్రయించవలసిందే.

కాంగ్రెస్సు ఆంధ్రరాష్ట్రంకోసం ప్రయత్నం చెయ్యడమే తటస్థపడితే గూడరాదుదాకా అది అరవలకు దఖలుపరచడానికే చూస్తుంది. తిరుపతిప్రాచ్యవిజ్ఞానసంస్థను చూసికూడా యిది గుర్తించుకోలేకపోతే, యిక తెనుగువాళ్లవల్ల యేమవుతుందీ?

అంటే ఆంధ్రరాష్ట్రం యిప్పట్లో రాదు. మన ప్రముఖులు గుజరాతీల కాంగ్రెస్సులో మునిగిపోవడం వల్లనే యిది యిలా తటస్థించింది.

కనక కాంగ్రెస్సేతరులు చెయ్యవలసిన మొదటి పని తెనుగుదేశంలోనుంచి కాంగ్రెసుని తరిమివెయ్యడమే.

అప్పుడుగాని ఆంధ్రజాతి భేదభావాలు విడిచి యేకతాటిమీదికి రాదు.

అప్పుడు గాని ఆంధ్రరాష్ట్రం రాదు.

ఈమహాయుద్ధం పూర్తి అయేలోపున మన మీాపని-అంటే ఆంధ్రదేశంలోనుంచి గుజరాతీకాంగ్రెస్సుని పారదోలగలిగితే శాంతి యేర్పడిన వుత్తరక్షణంలో ఆంధ్రప్రదేశం యెంతవరకూ వుందో అంతకీ సంబంధించిన ఆంధ్రరాష్ట్రం యేర్పడుతుంది.

లేదూ, ఆంధ్రరాష్ట్రమూ లేదు, చివరికి ఆంధ్రైక్యమూ లేదు.

గుంటూరి ఆంధ్రమహాసభ యిందుకు భిన్నంగా నడిచింది.

తన్నిర్వాహకులు గుజరాతీబట్టలమిల్లుల కోసమే చూశారు; గాని ఆంధ్రరాష్ట్రం కోసం చూడలేదు.

కాంగ్రెస్సు—గాంధిగారు

"ఒకమాటు మాట్లాడుకుందాం ర" మ్మని రాజప్రతినిధిగారు గాంధిగారికి వర్తమానం చేశారు. ఉబ్బెత్తుగా వెళ్లి రెండు గంటలసేపు సావకాశంగా మాట్లాడి గాంధిగారు మళ్ళీ వచ్చేశారు.

రాజప్రతినిధి జిన్నాగారికీ కబురంపారు. మరికొందరికీ వర్తమానించారు. వారూ మాట్లాడి వచ్చారు.

పరిపాలకులు పార్టీనాయకులతో యిలా మాట్లాడుతూ వుండడం మామూలు సంగతి.

ప్రజాసత్తాక రాజ్యాలలో యిది సామాన్యవిషయం.

అయితే, తక్కిన నాయకులలా కాక గాంధిగారు అనవసరమైన స్టేటుమెంటు ప్రకటించారు.

అహింసాతత్వమునందు అపరిమితమూ, అచంచలమూ అయిన నమ్మకం వుండడంవల్ల రాజప్రతినిధితో భారతీయుల ప్రతినిధిగా మాట్లాడడానికి తమకి అర్హత లేదుట. ఆసంగతే తాము రాజప్రతినిధితో చెప్పారుట. తమతో రాయబారాలు జరపడానికి తమ్మాహ్వానించి వుండలేదని రాజప్రతినిధి మాటలవల్ల తమకి స్పష్టం అయిందిట.

ఇలా చెప్పి, గాంధిగారు "వడంబడిక యేదైనా జరగవలసి వుంటే అది కాంగ్రెస్సుకీ రాజప్రతినిధికీ మాత్రమే" అంటున్నారు.

అయితే, రాజప్రతినిధి గాంధిగారి నెందుకు రమ్మన్నారూ?

తాము రాజప్రతినిధితో మాట్లాడి వచ్చేదాకా కాంగ్రెస్సు వర్కింగు కమిటీ సమావేశం జరిగించవద్దని గాంధిగారెందుకు కాజ్ఞాపించారూ?

ఇదంతా శుద్ధసత్యమే అనే మనం నమ్మాలా? నిజంగా గాంధిగారు నిర్లిప్తులే అని మనం సంతోషించాలా? మన స్వరాజ్యప్రయత్నాలలో, ఇలాంటి ప్రవృత్తిగల గాంధిగారు మాత్రమే బ్రిటిషువారితో వ్యవహరించదగినవారని మనం నమ్ముకోవలసిందేనా?

"అత్యంతరమణీయములగు పార్లమెంటు భవనములను, వెస్టుమినిష్టరు సబీని నామనోనేత్రము ఎదుట చిత్రించుకొని, యిట్టి నిర్మాణములు నాశనమగు నవకాశమును చిత్రించుకొనుచు నేను దుఃఖపరవశుడనై మాటలాడజాలకపోతిని" అంటున్నారు గాంధిగారు.

నిజంగా నేనా?

అయితే, వేలకొద్దీ వకీళ్ల జీవితాలూ వారి పెళ్లాంబిడ్డల బతుకులూ, వేలకొద్ది విద్యార్థుల భవిష్యత్తూ వారి తలిదండ్రుల ఆశలూ, వేలకొద్దీ యువతీయువకుల సాంసారికప్రవృత్తీ వారి భర్తల సుఖస్వప్నాలూ పార్లమెంటు భవనాల వాటి రమణీయాలు కావా?

అగ్గిపాలు చేయించబడ్డ, కోట్లు విలువగల మిల్లుబట్టలు రమణీయాలు కావా? అవి కద్దుకుంటే నికృష్టాలా?

భవనాలవంటి అచేతనపదార్థాలంటేనే గాంధిగారి హృదయం ద్రవిస్తుందా? వాటి మానవు లేమయిపోయినా సరే కాబోలునేం?

బ్రిటిషువారు ఈయుద్ధంలో దిగవలసిన పరిస్థితులు ఏర్పడడంవల్ల విశ్వవ్యాప్తమైన సామ్రాజ్యంలో వారు లైనవా రందరూ తల్లడిల్లిపోతున్నారు; కాని గాంధిగారికి అది దుఃఖకారణంగా లేదు.

లండన్ నాగరికత ప్రపంచప్రసిద్ధం. ప్రపంచానికి వరవడిగానూ వుంది. పార్లమెంటు భవనాలే గాని అది వారికి కనపడలేదు.

ఇది అనుచితంగా వుంది.

సత్యాహింసలను మాటుచేసుకుని విలయతాండవం సాగించే ప్రవృత్తి మాత్రమే యిందులో గోచరిస్తోంది.

పైగా, గాంధిగారు, తమ ప్రభావం స్మరించుకునే గర్వపడుతున్నట్టుంది గాని తమ స్టేటుమెంటువల్ల కాంగ్రెస్సు అంతస్తు యెంత పాతాళానికి జారిపోతూ వుందో గ్రహించినట్టు కనపడదు.

గాంధిగారికి, కాంగ్రెస్సులో సామాన్యసభ్యత అయినా లేదు. కాంగ్రెస్సు ఆవరణలో అడుగు పెట్టడానికే వారికి అర్హత లేదు.

కాని కాంగ్రెస్సు, వారి గుప్పిట్లో వుంది. కాంగ్రెస్సు పేరిట చెలామణీ అవుతూ వున్నది గాంధిగారి వినోదాభిలాషే గాని లక్షల సభ్యుల దృఢనిర్ణయం కాదు.

కాంగ్రెస్సు వలయంలో ఇవాళ హేమాహేమీలని పేరు తెచ్చుకుని వున్నవా రందరూ పండితులే కావచ్చు, వక్తలే కావచ్చు; కాని వారికి భావస్వాతంత్ర్యం లేదు, వాక్స్వాతంత్ర్యం లేదు, ఆచరణస్వాతంత్ర్యం లేదు.

ఇవి లేవని వారికి విచారం లేదు. అభిమానమూ లేదు.

కాంగ్రెస్సుకి వెలిగా వున్న గాంధిగారు చెప్పినట్టు మాత్రమే వారు చెయ్యగలరు.

ఈసంగతి కాంగ్రెస్సు అంధభక్తులకు తెలవకపోవచ్చు; కాని కాంగ్రెస్సేతరుల కందరికీ తెలుసు. ప్రభుత్వానికీ తెలుసు.

అయినప్పటికీ కాంగ్రెస్సు ప్రముఖులతో యేం మాట్లాడితే మాత్రం యెవరి కేం ప్రయోజనమూ?

గాంధిగారికి నచ్చచెప్ప గలిగితే కాంగ్రెస్సుచేత యేపని అయినా జరిగించుకోడాని కవకాశా లున్నప్పటికీ యీ కాంగ్రెస్సు ప్రముఖుల అవసరం యెవరికీ?

కనకనే రాజప్రతినిధి గాంధిగారికి కభురంపించారు.

ఇక ఏం చెయ్యాలో అది గాంధిగారు కాంగ్రెస్సు ప్రముఖులతో చెప్పి వారి చేతులమీదుగా చేయిస్తారు.

గాంధిగారికి కాంగ్రెస్సుమీంద అంత అధికారం వున్నప్పుడు వారికి, ఇక, వర్కింగుకమిటీని సమావేశపరిచి తంతునడపవలసిన అవసరం యేమిటీ అంటే, కాంగ్రెసు ప్రముఖులు, అంతా మన చేతిలోనే వుం దని పొంగిపోడానికి.

ఇలాగ, గాంధిగారు ఇదంతా తమ ప్రాజాపత్యం సాగడానికి వేసిన యెత్తేగాని మరేమీ కాదు.

ఈసంగతి గ్రహించగలవా రెవరూ కాంగ్రెసులో వుండలేరు.

నారిమన్‌గా రుండగలిగారా? ఖరేగా రుండగలిగారా? బోసుగా రుండగలిగారా? శ్రీనివాస అయ్యంగా రుండగలిగారా?

బతికున్న రోజుల్లో గోపాలకృష్ణయ్యగారూ, చిత్తరంజనదాసుగారూ యెదురుతిరక్కుండా వుండగలిగారా?

ఏ తావతా:

మహాయుద్ధం వొక్క బ్రిటిషువారికే కాదు. సామ్రాజ్యానికే కష్టకారణం.

మనకీ మరీ కష్టకారణం.

మన పరిస్థితులు తెలుసుకోకుండా ప్రగల్భాలు కొడితే ప్రయోజనం లేదు.

ఈయుద్ధంలో బ్రిటిషువారికి బాసటగా వుంటేనే మనకి శ్రేయస్సు.

ఇక చెప్పవల్సిం దేమి టంటే?

పూర్వపుతీర్మానాల ననుసరించి కాంగ్రెస్సు ఈపని చెయ్యడానికి వీలు లేదు.

కాని గాంధిగారు కాంగ్రెస్సుచేత యీపనే చేయిస్తారు.

ఎవరేం తంతు నడుపుకున్నా చివరికి తమతో సహకారం చెయ్యడమే బ్రిటిషువారికి ప్రధానం.

అది సిద్ధించే టప్పుడు కాంగ్రెస్సేం ప్రగల్భాలు కొట్టినా వారు గమనించరు.

మరి మనం?

తన సిద్ధాంతాలనూ, తన నిశ్చయాలనూ, పూరదొక్కి, తన బతుకంతా మరిచిపోయి, కాంగ్రెస్సు కూడా బ్రిటిషువారితో సహకారానికే సిద్ధపడేటప్పుడు దేశీయులు ఇక కాంగ్రెస్సుని లెక్కచెయ్యడం యెందుకూ? కాంగ్రెస్సేతరు లింకా దారికి రాలేదు

ఆంధ్రరాష్ట్రం విషయమై గుంటూరి కాంగ్రెస్సాంధ్రుల మహాసభ చేసిన తీర్మానం చాలా అసందర్భంగా వుంది.

చివరికి అంగీకరించబడ్డ సవరణ దానికి కొంచెం వూపిరిపోసింది; కాని ఆసవరణకు హేతుభూతు లైన కాంగ్రెస్సేతరులు గతమూ మరిచిపోయారు. భవిష్యత్తూ గుర్తించలేక పోయారు.

ఎలా గయినా కాంగ్రెస్సాంధ్రుల అనుగ్రహం తప్పిపోగూడదనే ప్రవృత్తే కనబరిచారు; గాని వారు దేశసౌభాగ్యం ప్రధానంగా భావించలేదు.

ఇరవై ఆరు సంవత్సరాలుగా మనం ఆందోళన చేస్తున్నాం; కాని మనకి రాష్ట్రం రాలేదు. ఓఢ్రులూ, సైంధవులూ ఆందోళన అన్న దే యెరగరు; కాని వారికి రాష్ట్రసిద్ధి అయింది.

ఏం?

రాష్ట్రప్రస్తావన ప్రారంభించిన మన ప్రముఖులు కాంగ్రెస్సు వూబిలో కూరుకుపోయారు. గుజరాతీల మాటలు విని, సైమన్‌కమిషనును బహిష్కరించడం ద్వారా, వారు, బ్రిటిషువారిని నిరసించి, తిరస్కరించి, ద్వేషించి ఆంధ్రరాష్ట్ర ప్రయత్నాలకు ప్రబలప్రతిఘటన పుట్టించారు.

ఓఢ్రులూ, సైంధవులూ యిలాంటి అవివేకానికి పాల్పడలేదు. ఆదేశాలలో కూడా కాంగ్రెస్సు ఏమాత్రమో లేకపోలేదు; కాని వారు రాష్ట్రం సందర్భంలో కాంగ్రెస్సుని స్మరించలేదు. దాన్ని తమ దగ్గరికే రానివ్వలేదు.

పైగా, వారి ప్రముఖులు లండను వెళ్లి కూచున్నారు. ఆవెళ్లినవారిని, యిక్కడ, దేశీయు లందరూ యెప్పటి కప్పుడు పూర్తిగా బలపరుస్తూ వచ్చారు.

ఆప్రముఖులు కాంగ్రెస్సువారూ, కాంగ్రెస్సేతరులూ అనే భేదభావమే ఆదేశీయులకు కలగలేదు. "వారు మనవారు. మనకి రాష్ట్రం తేవడానికి వెళ్లారు. మనం పంపితేనే వెళ్లారు" అనే భావించారు; గాని ఆదేశీయులు పార్టీ భేదాలు పెట్టుకోలేదు.

ఆదిలో ఆదేశీయులు బ్రిటిషు వారి సద్భావం అంతరించే పనులు చెయ్యనే చెయ్యలేదు.

మన కిలాంటి యోగ్యత యేదీ?

ఈక్షణంవరకూ కాంగ్రెస్సాంధ్రులు బ్రిటిషువారి సర్వస్వతంత్రాధికారం కంటే గుజరాతీల బానిసతనమే గొప్పదిగా భావిస్తున్నారు.

ఈక్షణంలో కూడా వారు బ్రిటిషువారిని ద్వేషిస్తూనే వున్నారు.

ఇది యిలా వుండగా:

మాంటుఫర్డు శాసనానికి సంబంధించిన చివరి యెన్నికలు అయిపోయిన తరవాతనే ఆదేశాలవారికి రాష్ట్రవాంఛ కలిగింది. కొత్తశాసనానికి సంబంధించిన యెన్నికలు రాక పూర్వమే వారికి రాష్ట్రాలు సిద్ధించేశాయి.

మన కిలా కాకపోయింది.

మన రాష్ట్రవాంఛ ౧. మింటో మార్లే, ౨. మాంటుఫర్డు, ౩. ౧౯౩౫—యిలాగ మూడు సంస్కరణశాసనాలను చూసింది. ఈశాసనాలకు సంబంధించిన యెన్నో యెన్నికలలో అంతఃకలహాలు పెంచుకుంది. దాసానుదాసత్వం కూడా సంపాదించుకుంది.

మన కాంగ్రెస్సాంధ్రుల అవివేకం యెంతవరకూ వెళ్లిందో చూడండి.

జస్టిస్సాంధ్రులు ఆంధ్రరాష్ట్రవిముఖులు అనుకోడం తెలివితక్కువ.

జస్టిస్సుమహానాయకులైన బొబ్బిలిప్రభువు లండనులో రౌండు టేబులు సభలో ఆంధ్రరాష్ట్ర ప్రయత్నాలు దృఢంగానే ప్రారంభించారు; కాని పరోక్షంగా అయినా కాంగ్రెస్సాంధ్రులు వారికి బలం యివ్వలేదు.

పైగా, బొబ్బిలిప్రభువు అక్కడ రాష్ట్రప్రయత్నాలు చేస్తూ వుండగా, కాంగ్రెస్సాంధ్రులు ఇక్కడ జస్టిస్సాంధ్రులను పడగొట్టడానికి—నాశనం చెయ్యడానికి—అదేనా సొంతశ్రేయస్సుకోసం కాదు, గుజరాతీల శ్రేయస్సుకోసం ప్రయత్నాలు సాగించారు.

పోనీ, కాంగ్రెస్సాంధ్రులేనా ఆప్రయత్నాలు సాగించే రేమో అంటే, వారిలో, రౌండుటేబులు సభకి వెళ్లదగిన యోగ్యత కలవారే లేకపోయారు.

తరవాత కొత్త యెన్నికలు వచ్చాయి.

ఆ సందర్భంలో కూడా కాంగ్రెస్సాంధ్రులు పాక్షికభేదాలే పెంచేశారు. ఇతరుల మాయలో పడి వారా పని చేశారు.

ఈర్ష్యాలువులై తమలో తామే కొట్లాడుకుని యీ కాంగ్రెస్సాంధ్రులు తమలో త్యాగమూర్తికి రావలసిన ప్రధానమంత్రిపదవిని యెగరగొట్టేశారు.

దీంతో, ఆంధ్రరాష్ట్రనిర్మాణం అంటే యెంతమాత్రమూ—యేకోశానా యిష్టం లేని రాజగోపాలాచారిగారు మనకి ప్రధానమంత్రి అయినారు.

ఇంకేందుకూ?

ఆంధ్రరాష్ట్రం అనేమాటే హాస్యాస్పదం అయిపోయింది.

ఇంతే కాదు. ఆచార్యులుగారు, అసెంబ్లీలో టెక్నికక్కి విరుద్ధమైన తీర్మానం చేయించి దాన్ని మళ్లీ ముక్కలు చేసి, ఇండియామంత్రికి పంపి, ఆయన జవాబు కప్పిపెట్టి, చివరికి యుద్ధం వచ్చేదాకా అసలుసంగతి మనకి తెలవకుండా చేశారు.

ఓఢ్రులు శాసనరీత్యా మన భూభాగం కొంత ఆక్రమించుకున్నారు; గాని ఆచారిగారు ఏశాసనమూ లేకుండానే తిరపతిదాకా తమ అరవదేశంలో కలిపేసుకున్నారు.

ఈలోగా స్పీకరు లండను, ఆంధ్రరాయబారులకు పరాభవం, వర్కింగుకమిటీ నీళ్ళు చల్లడం—ఇలాంటివన్నీ గబ్బిప్పుగా జరిగిపోయాయి.

ఈ సందర్భంలో మేము "సవాల్" చేసి అడుగుతున్నాము. ఇదంతా చూస్తే, కాంగ్రెస్సూ, కాంగ్రెస్సుమంత్రివర్గమూ, మన కాంగ్రెస్సాంధ్రులూ కాక ఇండియామంత్రా ఆంధ్రరాష్ట్రానికి శత్రువు?

కాంగ్రెస్సేతరులు చేసిన సవరణ అర్థశూన్యంగా వుంది. ఆంధ్రరాష్ట్రం కావాలన్నవారు చెయ్యవలసిన సత్యాగ్రహం కాంగ్రెస్సుమీదా దాని అంగాలమీదా కాని ఇండియామంత్రిమీద కాదు.

మనకి రాష్ట్రసిద్ధి కావాలంటే ఆక్రందింపు ఎలాగా తప్పదు.

అయితే, ముష్టిలో ముష్టి గోరుముష్టి అన్నట్టు అందుకోసం మనం కాంగ్రెస్సుని ఆశ్రయించడం శుద్ధ అవివేకం.

బ్రిటిషువారిని ఆశ్రయించకపోవడం మౌఢ్యమూ మౌర్ఖ్యమూ కూడానూ.

ఈ స్థితిలో కూడా గుంటూరి కాంగ్రెస్సాంధ్రుల ఆంధ్రమహాసభాతీర్మానంలో తాము చేయించిన సవరణ సరిగానే వుందంటారా కాంగ్రెస్సేతరులు?

అయితే, వారి పరిస్థితులను చూసి జాలిపడవలసిందే. మరి వుపాయాంతరం లేదు.

హిందీ ముప్పు తెచ్చిపెడుతుంది

హైస్కూళ్లలో కొత్తగా ప్రవేశపెట్టే హిందీబోధకులకు నెలకి ౩౦—౦—౦ లకు తక్కువ లేకుండా జీతం యేర్పాటు చెయ్యాలని కాంగ్రెస్సు మంత్రుల తాఖీదు.

తెనుగు పండితులకు మాత్రం యెంత తక్కువ జీతం యిచ్చినా వారికి బెంగ లేదు. తెనుగు పండితుల జీతానికి నిర్ణయం అక్కర్లేకపోయింది కాంగ్రెసు మంత్రులకు. అసలు, తెనుగు పండితులను వేసుకోకపోయినా వారు, పాఠశాలాధికారులను ఆక్షేపించరు. హిందీబోధకులను మాత్రం నియమించాలి, నియమించి తీరాలి.

దేశభాషల తరవాతే హిందీ అనే గాంధిగారి మాటలో సత్యం కాస్తయినా వుందా? దక్షిణదేశభాషలను చంపెయ్యడానికే గాంధిగారి ప్రయత్నం అని చెప్పడానికిక సంకోచం యెందుకూ?

తెనుగుదేశంలో హిందీప్రాబల్యం లేదని ఆంధ్రమంత్రుల ప్రగల్భాలూ, పార్లమెంటరీ శక్రటరీల కోతలూనూ. ఆంధ్రులకు కావలసిందేమిటో వారు చెప్పగలరా? రాష్ట్రీయకాంగ్రెస్సు అధ్యక్షుల తాఖీదులను బుట్టదాఖలు చేసి తమ ఆంధ్రదేశంలో, తమ సాటి కాంగ్రెస్సు ముగ్ధతే బోసుగారికి పాదపూజలు చేశారే, యిది ఆంధ్రమంత్రులకూ, పార్లమెంటరీ ఆంధ్రశక్రటరీలకూ తెలుసా? దీన్ని పట్టి, కాంగ్రెస్సాంధ్రులలో అధికసంఖ్యాకులకు గాంధిగారూ, గాంధిగారి కాంగ్రెస్సుహితవాదులూ, కాంగ్రెస్సు మంత్రులూ అక్కర్లేదని తేలుతూవుండడం కూడా వారు గుర్తించుకుంటున్నారా?

హిందీప్రతికూలురను జెయిళ్లకు పంపుతూ వున్న కాంగ్రెస్సు మంత్రివర్గం యీ గాంధిప్రతికూలురను కూడా అలాగే శిక్షించగలదా?